

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర్లును పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

# మళ్లీ గులాబీదే గెలుపు

- స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక ఖాయం
- కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి 700 మంది చేరికలు
- రామన్న సమక్షంలో చేరిన ధర్మసాగర్, వేలేరు మాజీ ప్రతినిధులు, నాయకులు
- కంటికి రెప్పలా కాపాడుకుంటా : స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్/వేలేరు, ఫిబ్రవరి 25 : రాబోయే రోజుల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉప ఎన్నిక రావడం.. మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని.. అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో 500 మంది చేరారు. ధర్మసాగర్ నుంచి మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ సీనియర్ నేత ముల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్, పీచర మాజీ ఎంపీటీసీ స్వరూప-జంపయ్య, మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ ఆల్ల రవి, ధర్మపురం బాలస్వామి, చాగల్లు నుంచి బా స్కుల అనిల్, భాస్కర్, ధర్మసాగర్ మండలానికి చెందిన మాజీ వార్డు సభ్యులు వల్లపురెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సట్ల రవి, ఎం సాంబరాజు, గొట్టిముక్కల రాజు, ఎన్.సంపత్, మండల రవి, కమ్మరిపేట మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌తో పాటు అనేక మంది బీఆర్ఎస్ చేరారు. చేరికల కార్యక్రమానికి స్టేషన్ ఘన్‌పూర్ మండలం నుంచి పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, కుడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మాజీ సర్పంచ్ తాటి కొండ సురేశ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, గుండె రంజిత్, కనకం గణేశ్, మాతంగి దేవయ్య, వేలేరు నుంచి మండలం ఇన్‌చార్జి భూపతిరాజ్, నాయకులు గోవింద సురేశ్, బత్తుల శ్రీనివాస్ హాజరయ్యారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

**బీఆర్ఎస్ బలోపేతానికి పనిచేయాలి**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరి, ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ప్రతి ఒక్కరినీ కంటికిరెప్పలా కాపాడుకుంటానన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరిన వారికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

**నియోజకవర్గంలో మళ్లీ కారు జోరు**

అధికార పార్టీని కాదని బీఆర్ఎస్‌లోకి నాయకులు, యువత పెద్ద ఎత్తున చేరడంతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో మళ్లీ కారు జోరు కనిపిస్తున్నది. దీంతో గులాబీ దళంలో ధైర్యం, ఆనందం పెరిగింది. త్వరలో సుమారు 2వేల మంది బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం, రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో అసంతృప్తి, వ్యతిరేకత, తదితర కారణాలతో కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదిలాగే కొనసాగుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా కొనసాగడం ఖాయం.





విద్యుత్ వెలుగుల్లో వేయి స్తంభాల ఆలయం



ముస్తాబైన మెట్టుగుట్ట ఆలయం

*శివ పూజకు వేళైంది. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. కాళేశ్వరంలోని ముక్తీశ్వర స్వామి, హనుమకొండలోని వేయి స్తంభాల గుడి, మడికొండలోని మెట్టుగుట్ట, పాలకుర్తి, పాలంపేటలోని రామప్ప ఆలయం, గణపురంలోని కోటగుళ్లు, తదితర శైవ క్షేత్రాలు విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనాయి.*

# రోజూ పప్పు, సాంబారే మేడం..!

- కలెక్టర్‌తో చెప్పుకొన్న జాన్‌పాక విద్యార్థులు
- మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవు
- వరంగల్ కలెక్టర్ సత్యశారద హెచ్చరిక



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

గీసుగొండ, ఫిబ్రవరి 28 : మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడం లేదని, రోజూ సాంబార్, పప్పుతోనే భోజనం పెడుతున్నారని విద్యార్థులు వరంగల్ కలెక్టర్ సత్యశారదకు చెప్పుకొన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, ఇష్టానుసారం వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సత్యశారద హెచ్చరించారు. ప్రభుత్వం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని చెబుతుంటే మీరేం చేస్తున్నారని హెచ్ఎంను మందలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలన్నారు. వంటలు వండే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఇష్టారీతిన వంటలు చేసి పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రోజుకో కూరతో భోజనం పెట్టాలని ఆదేశించారు. ఇక్కడ డీఈవో జ్ఞానేశ్వర్, ఎంఈవో సత్యనారాయణ ఉన్నారు.

# ఇసుక క్వారీలతో కరకట్టకు ముప్పు

- వరదలతో తెగిపోయే అవకాశం
- ప్రత్యామ్నాయంగా సాగు భూములివ్వాలంటున్న రైతులు



ఇసుక క్వారీలో వేసిన రోడ్డు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 25 : ఎగువ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఇసుక క్వారీలతో జంపన్న వాగు, గోదావరి కరకట్టకు వరద ముప్పు పొంచి ఉంది. దీంతో ఏటూరునాగారం మండల కేంద్రం ఎప్పుడు మునిగిపోతుందో తెలియని పరిస్థితి. 1986లో వచ్చిన గోదావరి వరదలు ఏటూరునాగారంను పూర్తిగా ముంచేయడంతో చుట్టూ రామన్నగూడెం వరకు వరద కరకట్ట నిర్మాణం చేపట్టారు. ఉధృతంగా వచ్చే వరద తాకిడికి ఇప్పటికే పలు చోట్ల కరకట్ట దెబ్బతిన్నది. ఇదిలా ఉండగా ఇసుక మేటల తొలగింపు పేరుతో క్వారీల నిర్వహణకు ఇస్తున్న అనుమతులతో కరకట్టకు ప్రమాదకరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. గోదావరి కరకట్ట మరమ్మతు, పటిష్టత కోసం నిధులు మంజూరు కాగా అత్యవసరమైన చోట ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. కరకట్టకు వరద ముప్పు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గోదావరి, వాగు మధ్యలో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి వాటిని తొలగించిన తర్వాత సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. ఎంత తవ్వినా ఇసుక రావడం, నీళ్లు ఊరడంతో రైతులు సాగు చేసేందుకు యోగ్యం కావడం లేదు. ఈ భూములను బడా కాంట్రాక్టర్లు కౌలుకు తీసుకుని వ్యాపారం చేస్తుండగా రైతులు మాత్రం నష్టపోతూనే ఉన్నారు. యంత్రాలు సమకూర్చుకోలేపోవడం, రోడ్లు వేసే స్థోమత లేకపోవడంతో రైతులు ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం ఇసుక మేటలు వేసిన పట్టా భూములకు కూడా రైతు బంధును ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసింది. అన్ని విధాలుగా నష్టపోతున్న తమకు భూములకు ప్రత్యామ్నాయంగా తమకు సాగు భూములు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇసుక క్వారీల నిర్వహణతో కరకట్టకు ముప్పు ఉంటున్నట్లు గుర్తించిన నీటి పారుదలశాఖ అధికారులు గోదావరి కరకట్టకు ఎగువ ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ఏర్పాటు చేసేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తున్నది.

- వారిని నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్, బీజేపీలు
- బోగస్ మాటలతో అధికారంలో కొచ్చిన ఆ పార్టీలు
- వారికి ప్రజలే బుద్ధి చెప్తారు
- రైతు బంధు ఇవ్వలేదు.. రుణమాఫీ చేయలేదు
- క్వింటా మిర్చికి రూ. 25 వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మాజీ ఎమ్మెల్యేలతో కలిసి ఎనుమాముల మార్కెట్ సందర్శన
- మిర్చి రైతుల సమస్యలు తెలుసుకొని మేమున్నామని ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ నేతలు



ఎనుమాముల మార్కెట్‌లో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యేలు



మహిళా రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

# రైతుల గోస తాకుతది

**ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

*– గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే*

ఎన్నికల సమయంలో రైతుల సమస్యలను పరిష్కరించి మిర్చి పంటకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఎగుమ తులకు 10 శాతం బోనస్ ఇవ్వాలి. రైతులను నిర్లక్ష్యం చేస్తే తొందర్లో బొంద పెడుతారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే కేంద్రంతో మాట్లాడి క్వింటాకు రూ. 25 వేలకు తక్కువ కాకుండా కొను గోలు చేయాలి. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది.

కాశీబుగ్గ, ఫిబ్రవరి 25 : రైతుల గోస కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాకుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డును మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, రైతు విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్నతో కలిసి సందర్శించారు. మిర్చి రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని వారికి మేమున్నామంటటూ ధైర్యం చెప్పారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు బోగస్ మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చాయని, రైతులను మోసం చేసిన ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి తొందర్లోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు రాకపోవడం చాలా బాధాకరంగా ఉందని, వెంటనే ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ. 25 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం కంటే క్వింటా మిర్చికి రూ.10 వేలు పడిపోవడంతో రైతులు అనేక అపసోపాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో పేజీ నంబర్ 9లో మిర్చి రైతులకు రూ.15 వేలకు తగ్గకుండా పంటను కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీని మరిచిపోయారని గుర్తు చేశారు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం రైతులను కాంగ్రెస్ సర్కారు నట్టేట ముంచిందని అన్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ప్రత్యేక రివ్యూ నిర్వహిస్తుంటే మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం పాలనపై సోయి లేక రాజకీయాల కోసం ఎన్నికల్లో ప్రచారాలు చేస్తూ కాలం గడుపుతున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలని, అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు రైతులకు మద్దతు ధరలు ఇచ్చేలా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, కుడా మాజీ డైరెక్టర్ మోడెం ప్రవీణ్, నాయకులు కేతిరి రాజశేఖర్, పత్రి సుభాష్, రాజపోశాలు, గండ్రాతి భాస్కర్, సిలువేరు వపన్, జక్కి యుగేంధర్, కొత్తపెల్లి యాదగిరి, నాతం హరీశ్, బానోత్ కిరణ్‌నాయక్, పసులాది మల్లయ్య పాల్గొన్నారు.

**సర్కారు ఆదుకోవాలి**

*– పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే*

మిర్చి పండించిన రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలి. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత సంవత్సరం కంటే సగానికి సగం మిర్చి ధరలు పడిపోయాయి. నాణ్యతను బట్టి గిట్టుబాటు ధరలతో సర్కారే కొనుగోలు చేయాలి. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి.

**రైతులే గద్దె దించుతరు**

*– నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే*

మద్దతు ధర ఇవ్వకుండా రైతన్న కడుపు కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారే గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారు. మిర్చి ధరలు పడిపోయి ఆందోళన చెందుతున్న రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. పెట్టిన పెట్టుబడి రాక అన్నదాతలు ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. కాంగ్రెస్ సర్కారు రైతుల జీవితాలతో ఆటలాడుతున్నదని, తొందర్లోనే భూస్థాపితం చేస్తారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, ఎరువులు సరఫరా చేయడంలో, బీమా కల్పించడంలో కేసీఆర్‌ను మించిన నాయకుడే లేడు. స్థానిక జిల్లా మంత్రి కొండా సురేఖ మార్కెట్‌లో రైతులు పడుతున్న ఇబ్బందులు, వివిధ కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదు.

# మూతపడిన ఇందిరా క్యాంటీన్

*కాంగ్రెస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు మూతపడుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ప్రారంభించి నెలకాక ముందే బందయ్యింది. ఆదాయం రావడం లేదని, దాన్ని నడుపలేమని నిర్వాహకులు చేతులెత్తేశారు. బ్యాంకు నుంచి రూ. 5 లక్షల రుణం తీసుకుని క్యాంటీన్ ప్రారంభించగా, ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా ఈ పథకాన్ని ప్రవేశపెట్టడంతో మూడు రోజుల వ్యవధిలోనే కష్టాలు మొదలయ్యాయి. దీంతో ఆర్థికంగా తమను ఆదుకుంటుందన్న మహిళల ఆశలు ఆవిరయ్యాయి.*

*- తొర్రూరు, ఫిబ్రవరి 25*



మూతపడి ఉన్న తొర్రూరులోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్

- ప్రారంభించి నెలకాక ముందే తొర్రూరులో బంద్
- కాంగ్రెస్ ప్రతిష్టాత్మక పథకం తుస్సు
- ఆదాయం రావడం లేదని చేతులెత్తేసిన నిర్వాహకులు

మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించాలని కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన 'ఇందిరా మహిళా శక్తి పథకం'కు ఆదిలోనే ఆటంకాలు ఏర్పడ్డాయి. తొర్రూరులోని అన్నారం రోడ్డు సమీపంలో మదర్ థెరిస్సా మహిళా సహాయక సంఘం భవనంలో 2024 డిసెంబర్ 6న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ప్రారంభించారు. ఈ క్యాంటీన్ నిర్వహణకు వీవో అరుణ జ్యోతి సంఘం ఆధ్వర్యంలో ఫత్తేపురం గ్రామానికి చెందిన జీవన జ్యోతి మహిళా పొదుపు సంఘం ముందుకొచ్చింది. ఇందులో ముగ్గురు సభ్యులు సంధ్య, పద్మ, హైమ బ్యాంకు నుంచి రూ. ఐదు లక్షల రుణాన్ని తీసుకొని, రూ. 4 లక్షలతో క్యాంటీన్ ప్రారంభించారు. ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు ప్రభుత్వం సరైన ప్రణాళిక, అవగాహన లేకుండా పథకాన్ని ప్రవేశపెట్టడంతో మూడు రోజుల వ్యవధిలోనే మూతపడింది.

**ఆదాయం అంతంత మాత్రమే..**

క్యాంటీన్ ప్రారంభించినప్పటి నుంచి ప్రతి రోజూ రూ. 200-400 మధ్యే ఆదాయం వస్తున్న దని, నిర్వహణా వ్యయం భరించలేకపోతున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆర్థికంగా నష్టపోతున్నామని, కొనసాగించలేమని అధికారులకు తేల్చి చెప్పారు. క్యాంటీన్ ఏర్పాటు చేసిన ప్రదే శం సరైనదేనా? లేకపోతే మార్చాల్సిన అవసరముందా? స్థానికులు వినియోగించేందుకు ఆసక్తి చూపడం లేదా? అన్న సందేహాలు నిర్వాహకుల్లో వ్యక్తమవుతున్నాయి.

**క్యాంటీన్ నడపలేం..**

ఇందిరమ్మ మహిళా క్యాంటీన్ ప్రారంభించి స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆశపడ్డాను. కానీ వస్తున్న ఆదాయం పెట్టుబడికే సరిపోవడం లేదు. అదేవిధంగా సీఐఎఫ్ ద్వారా బ్యాంకు నుంచి రూ.4లక్షల రుణం తీసుకొని, రూము, తలుపులు, వంట సామగ్రి కోసం రూ.3,20,000 ఖర్చు చేశాను. రెండు నెలలు కిస్తీలు రూ. 2400 కట్టాను. క్యాంటీన్ నడుపలేమని అధికారులకు విన్నవించాను.

– సంధ్య, జీవనజ్యోతి సంఘం సభ్యురాలు

**వేరే వారికి కేటాయిస్తాం..**

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నడుపలేమని నిర్వాహకులు చెప్పేశారు. ఇంకా అధికారికంగా తెలియజేయలేదు. క్యాంటీన్ నిర్వహణలో ఎక్కువ మంది ఆసక్తి చూపితే టెండర్ ద్వారా కేటాయిస్తాం. దీని నిర్వహణ గరిష్ఠంగా నాలుగేళ్లపాటు ఉంటుంది. ఆ తర్వాత కొత్త వారికి అవకాశం కల్పిస్తాం.

–సంజీవరావు, ఏపీఎం, తొర్రూరు


























